కార్తికం.. కమనీయం..

- అంతటా ఆధ్యాత్మిక శోభ
- ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేటి నుంచి కార్తికమాసం ప్రారంభం



లొల్ల లాకులు



పుల్లేటికుర్రులో వేంచేసియున్న వ్యాఘ్రేశ్వర స్వామి

అలమూరు: హిందువులకు అత్యంత ప్రీతికరమైన కార్తికమాసం ప్రారంభమైంది. గ్రామాల్లోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబు కావడంతో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ఈనెల రోజులు అన్నస మారాధనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తుల సందడి నెలకొంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో వాడవాడలా నెలకొన్న శైవ క్షేత్రాలన్నీ భక్తుల పూజలందుకునేందుకు దేవదాయశాఖ ఆలయాన్నింటినీ సిద్ధం చేసింది. ఇక నుంచి నెల రోజుల పాటు గ్రామాలన్నీ శివనామస్మ రణతో మార్మోగనున్నాయి. ప్రసిద్ధ శివాలయాల్లో హోమాలు, బిల్వార్చనలు, లక్ష తులసీ దళ పూజలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఈనెల రోజుల పాటు భక్తులు అత్యత నియమ నిష్ఠలతో ఆధ్యాత్మిక చింతనతో ఉపవాస దీక్షలు చేపట్టి శివపురాణం పఠించనున్నారు.

కార్తికమాసం.. బహు పవిత్రం..

తెలుగు మాసాలన్నిటి కంటే కార్తికమాసాన్ని ప్రజలు పరమ పవిత్రంగా భావించి శివకేశవుల కరుణ కటాక్షాల కోసం భక్తిభావంతో పూజిస్తారు. కార్తికమాసంలో అన్నదానానికి అత్యంత ప్రాముఖ్యత ఉండటంతో భక్తులు వన సమారాధనలకు ప్రాధాన్యతనిస్తారు. దీంతో కార్తికమాసం నెల రోజులు ఎక్కడా చూసినా అన్న సమారాధనలే దర్శనమిస్తుంటాయి. ఈనెల రోజులూ భక్తులు శంకరున్ని కొలుస్తూ ఆధ్యాత్మిక భావంతో తన్మయత్వం చెందుతారు. హిందూమతాచార తిథులు ప్రకారం దీపావళి పండగ మరుసటి రోజే వచ్చే కార్తికమాసం నెల రోజుల పాటు భక్తి భావంతో శివపరమాత్ముడికి పూజలు నిర్వహించడం పరిపాటి. ఈ ఏడాది అమావాస్య తిథులు మిశ్రమంగా ఉండటంతో కార్తికం ఒక రోజు ఆలస్యంగా ప్రవేశించింది. మార్గశిర మాసం విష్ణుమూర్తికి, కార్తికమాసం శివుడికి ప్రీతికరమని పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయి. ఈ కార్తికమాసంలో భక్తిశ్రద్ధలతో శివుడ్ని ఆరాధిస్తే సకల సౌఖ్యాలు సిద్ధించి అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అతి పవిత్రమైన ఈ కార్తికమాసంలో భక్తులు వీలైనంత శుద్ధి, శుభ్రతలను పాటిస్తూ దైవచింతన, పాప ప్రీతి, దాతృత్వాలు కలిగి ఉంటారు. మాంసాహారాన్ని త్యజించి ఆధ్యాత్మిక చింతనే పరమావధిగా భావిస్తారు. నాగులచవితి, క్షీరాబ్ది ద్వాదశి, కార్తిక పౌర్ణమి వంటి ముఖ్య పర్వదినాలతో పాటు ఈమాసంలో వచ్చే నాలుగు సోమవారాలు, రెండు ఏకాదశుల పర్వదినాలు శివ భక్తులకు మరింత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు.

శైవక్షేత్రాల ముస్తాబు

అంబాజీపేట: కార్తిక మాసానికి మండలంలోని శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. మంగళవారం వేకువజాము నుంచి శివాలయాలు పోటెత్తనున్నాయి. మండలంలోని మాచవరం, వాకలగరువు, తొండవరం, నందంపూడి, చిరతపూడి, ఇసుకపూడి తదితర గ్రామాల్లోని శివాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కౌశిక వద్ద స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పర్యాటక సందడి

ఆత్రేయపురం: మండలంలో ఆత్రేయపురం సమీపాన లొల్లలాకులు, బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక పర్యాటక కేంద్రాలుగా ఖ్యాతికెక్కాయి. పరవళ్లు తొక్కుతూ సోయగాలొలుకుతూ లొల్ల లాకుల నుంచి విడుదలవుతున్న సాగునీరు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కార్తికమాసంలో పర్యాటకులతో ఆత్రేయపురం సమీపాన ఉన్న లొల్లలాకులు, పిచ్చుకలంకకు కొత్త శోభ సంతరించుకుంటుంది. సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు కోనసీమలో సాగునీటి వ్యవస్థ నిర్వహణకు లాకులను నిర్మించారు. లాకులు గేట్లు ఎత్తే సమయాల్లో వాటి నుంచి ఎగసిపడుతూ ప్రవహించే నీటి కెరటాలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి లొల్ల లాకుల వరకు ప్రవహించే ప్రధాన పంట కాలువ లొల్ల లాకుల వద్ద ముక్తేశ్వరం, అమలాపురం, గన్నవరం కాలువలుగా విడిపోతుంది. ఆ మూడు కాలువలకు నీరు వెళ్లే దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. దీంతో జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కార్తికమాసంలో లొల్ల లాకుల వద్ద కార్తిక సమారాధనలు జరుపుకొనేందుకు పర్యాటకులు వేలాదిగా తరలివచ్చి అక్కడ నుంచి పిచ్చుకలంకను సందర్శిస్తారు. ఇక్కడకు రావాలంటే రాజమహేంద్రవరం నుంచి వయా బొబ్బర్లంక మీదుగా 25 కిలోమీటర్లు ఉంటుంది. అలాగే రావులపాలెం నుంచి వయా బొబ్బర్లంక బస్సు మీదుగా 10 కిలోమీటర్లు ఉంటుంది.

క్రైస్తవుల పక్షపాతి సీఎం జగన్

రాజోలు: క్రైస్తవులు పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారని క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కనపాల బాబూరావు అన్నారు. సోమవారం రాజోలులో మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జి.పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులతో పాటు పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ నెల 28న మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో జరిగే పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనానికి రాజోలు నియోజకవర్గానికి చెందిన పాస్టర్లు అంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎస్.ప్రసాదరావు, టి.కృపానందం, డి.రాజు, కె.డానియేల్, ఏలియా, డి.రమేష్, వై.కె.రాజు, జి.తిమోతి, ఎం.మధు, కె.రిబ్కా, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని జన్మనక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, సహాయ అర్చక నాగ సీతారాం ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి తెచ్చిన పవిత్ర జలాలను ఆలయ అర్చకులు వేదమంత్ర పఠనాలతో 108 కలశల్లోకి ఉంచి, జలాలల్లోకి శ్రీ స్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయసారథి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాధువులకు దుస్తుల పంపిణీ



సాధువులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సాధువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ట్రస్టు బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, చిట్టాల సత్తిబాబు, బత్తుల విజయగంగారత్నం, కొండేటి వెంకటేశ్వరరావు, యూవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఆలోచన అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం చింతలమోరిలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గంటా బేబీ అనే మహిళకు హెల్పింగ్ ద నీడ్స్ ఎన్ఆర్ఐ సంస్థ సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా సోమవారం అందించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ సేవలను కొనియాడారు. గతం నుంచీ కూడా ఈ సంస్థ అనేక ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోటె రాజబాబు, మోకా దివాకర్, రొక్కాల వెంకట్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మానవాళీ మహాముని తిరు నక్షత్రోత్సవాలు



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న మండలంలోని వాడపల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మానవాళీ మహాముని ఆళ్వార్ తిరు నక్షత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, పుణ్యాహవాచనం, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామికి అష్టోత్తర పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మానవాళీ మహాముని ఆళ్వార్ తిరు నక్షత్రోత్సవాల్లో భాగంగా దేవతామూర్తుల విగ్రహాలను పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన జంధ్యాల అరవింద్, విజయలక్ష్మి దంపతులు సోమవారం రూ.50 వేల విరాళం అందించారు. వారి కుమార్తెలు దీప్తి, శ్వేత, వారి కుటుంబ సభ్యులు ఈ విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

చతుర్థ శాంతి యమధర్మ స్థూపం నిర్మాణం

అమలాపురం టౌన్: స్థానిక దక్షిణమూర్తి శక్తి స్థల్‌లో బహుళ చతుర్దశికి నిర్వహించే జ్యోతిర్లింగార్చన కోసం చతుర్థ శాంతి స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు అమలాపురం శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు తెలిపారు. పద్నాలుగు లోకాలకు ప్రతీకగా పద్నాలుగు అరలతో వెయ్యి కేజీల బరువుతో రూ.1.50 లక్షలతో స్థూపాన్ని నిర్మిస్తున్నామన్నారు. స్థూప నిర్మాణానికి సత్యం స్కూల్ చైర్మన్ సలాది సత్యనారాయణ రూ.25 వేలు, చెన్నైకి చెందిన కొమ్ముల మాలతి రూ.10 వేలు, రేకపల్లి సోమేశ్వరరావు రూ.5 వేలు అందించారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



సఖినేటిపల్లిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: పేదల పక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలో ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద ప్రజలందరికీ సీఎం జగన్ ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని ఆయన అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, కోఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, నాయకులు గెడ్డం అమ్ములు, రాపాక సూరయ్య, ఆర్.వెంకట్, కె.అశోక్ పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు



అంతర్వేది ఆలయం వద్ద ప్రసాదరాజుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం నర్సాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వద్ద ఆయనకు పూర్ణకుంభంతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్‌లు స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి అందజేశారు. పార్టీ నాయకులు కేపీఎస్ఎన్ రాజు, ముప్పర్తి త్రిమూర్తులు, వలవల రాంబాబు పాల్గొన్నారు.

అవిడిలో విషాదం



కొత్తపేట ప్రభుత్వాస్పత్రి వద్ద సంఘటనపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని అవిడిలో ఆదివారం అర్థరాత్రి జరిగిన దంపతుల ఆత్మహత్య ఘటన గ్రామస్తుల్లో విషాదాన్ని నింపింది. గ్రామంలోని కట్వలాంబికా కాలనీకి చెందిన పెదపూడి ఆదినారాయణ (42), అతని భార్య మంగాదేవి (35) మృతి చెందారు. డబ్బు కోసం క్షణికావేశంలో జరిగిన ఈ సంఘటనా స్థలాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్‌బాషా, ఇన్‌చార్జ్ డీఎస్పీ సుంకర మురళీ మోహన్, రావులపాలెం సీఐ రజనీకుమార్, స్థానిక ఎస్సై వి.మణికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దిగ్భ్రాంతి

అవిడి గ్రామానికి చెందిన భార్యాభర్తలు మృతి చెందిన సంఘటనపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారంతో సోమవారం ఉదయం హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని మృతుల బంధువులను పరామర్శించారు. దహన సంస్కారాలు, ఇతర ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సాయం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ ధూళి సూరిబాబు, హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్ తదితరులు ఉన్నారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో కుంభ నైవేద్యం



నడిపూడిలో విశ్వేశ్వరస్వామికి కుంభ నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడిలో అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపావళి రోజున కాశీలో అన్నపూర్ణమ్మ వారికి సమర్పించినట్లుగా కుంభ నైవేద్యం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పండు స్వామి ఆధ్వర్యంలో క్రతువు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అరిగెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అధికారి వెంకటేశ్వరరావు, అరిగెల బాబి, ఆర్వీ నాయుడు, అధికారి బాబ్జి, కేకే స్వామి పాల్గొన్నారు.

ఘనంగా గోవర్ధనగిరి పూజ



గోవర్ధనగిరి గోపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం రూరల్: మండలంలోని జనుపల్లెలో ఇస్కాన్‌కు కేటాయించిన స్థలంలో గోవర్ధనగిరి పూజ, గోపూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్ స్టాల్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, సర్పంచ్ గాణాల భారతి, తుని వైఎస్సార్ సీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నిమాయి దాస్, అమలాపురం అవుట్ పోస్ట్ సెంటర్ ఇన్‌చార్జ్ శివానంద నిమాయిదాస్, కౌన్సిలర్ యన్నాబత్తుల పద్మ, పెంకే రామ్మోహన్‌రావు, వేమన సూర్యనారాయణ, గొవ్వాల రమణ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజోలు: చింతలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు డి.జానకీరామయ్య ఆధ్వర్యంలో పలువురు అభినందించారు. అండర్-17 విభాగంలో కొల్లు దుర్గాప్రసాద్, సోడదాసు మౌల్యశ్రీ, నక్కా రిక్షిత, కోళ్ల కల్పన, అండర్-14 విభాగంలో గొల్లమందల వినీషా, కోళ్ల లక్ష్మీసాయి అమృత, బత్తుల లావణ్యలు ప్రతిభ చూపారు. ఈ నెల 15,16,17 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీ చొప్పల చంద్రశేఖర్ తెలిపారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు తదితరులు విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి శాఖాగ్రంథాలయ వారోత్సవాలు

అంబాజీపేట: శాఖా గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు సహకరించాలని శ్రీనివాస్ కోరారు. 14న గ్రంథాలయ వారోత్సవాలు, ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తుల చరిత్ర వివరణ, 17న రచయితల సందేహాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవంలో భాగంగా వివిధ కార్యక్రమాలు, 20న డిజిటల్ గ్రంథాలయాలు, 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలను నిర్వహించనున్నామన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

సఖినేటిపల్లి: మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబును సోమవారం ఆయన ఇంటి వద్ద రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరామర్శించారు. సఖినేటిపల్లిలో ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంట తిరుగుతూ ప్రమాదవశాత్తూ పడిపోవడంతో చేయి విరిగింది. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చిట్టిబాబును ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం



పెదపట్నంలంకలో నిర్వహిస్తున్న బాలబాలాజీ స్వామి కల్యాణం

మామిడికుదురు: వేద మంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా పెదపట్నంలంక గ్రామ దేవత కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఈ కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకు వచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువును అర్చకులు ఘనంగా జరిపించారు. వేద పండితులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, జ్యోత్సుల సోమయాజులు నేతృత్వంలో ఈ వేడుక ఆద్యంతం కమనీయంగా జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, బత్తుల విజయగంగారత్నం, గూటం శ్రీను, నగరం ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రజక ఆత్మగౌరవ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



మామిడికుదురులో రజకుల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ

మామిడికుదురు: రజక సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న గుంటూరులో జరిగే రజక ఆత్మ గౌరవ మహాసభ పోస్టర్‌ను మామిడికుదురులో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పేట భాస్కరరావుతో పాటు సంఘం ప్రతినిధులు ఈ ఆవిష్కరణలో పాల్గొన్నారు. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ సదుపాయం కల్పించాలని, చట్ట సభల్లో రజకుల ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో 26వ తేదీ ఆదివారం గుంటూరులో ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటికి ఒక్కరు వంతున ఈ సభకు హాజరు కావాలని, తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో నగరపు సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి దుర్గారావు, నేదునూరి రాజ్‌కుమార్, పాశర్లపూడి శ్రీరామ్‌సత్యప్రసాద్, అధికారపు వీరన్నబాబు, పసుపులేటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

కొత్తపేట: దుష్టశిక్షణ.. శిష్టరక్షణకు ప్రతీకగా జరుపుకొనే దీపావళి పర్వదినాన్ని ప్రతి ఇంటా ఘనంగా జరుపుకొన్నారు. హిందూ సంప్రదాయ ప్రధాన పండగల్లో ఒకటైన దీపావళి పర్వదినాన కేవలం హిందువులే కాకుండా అన్ని మతాల వారూ బాణసంచా కాల్చి ఆనందకాంతుల పండుగ చేసుకున్నారు. దాదాపు ప్రతి ఇంటా దీపావళి రోజు ఆదివారం సాయంత్రం లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. చీకటి పడుతుండగానే ఇంటి గుమ్మాలు, గేట్లకు ఇరువైపులా, ఇంటి చుట్టూ ప్రహరీలపైన, భవనాల పిట్టగోడలపైన వివిధ రకాల ప్రమిదలతో దీపాలను వెలిగించారు. పలు కుటుంబాల వారు ఆనవాయితీ ప్రకారం దివిటీలు వెలిగించారు. సాయంత్రం 6 గంటల నుంచి దీపావళి బాణసంచా కాల్చారు. ఈ పండగను కుల, మత, పేద, ధనిక, చిన్నా, పెద్ద తారతమ్యం అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం ఆనందంగా చేసుకున్నారు.

అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తం

దీపావళి బాణసంచా కాల్పుల నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. స్థానిక ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏ విధమైన అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎక్కడ ఏ చిన్న అగ్నిప్రమాదం సంభవించినా హుటాహుటిన వెళ్లి ప్రమాదం నివారించేందుకు సిబ్బంది అందరూ ఫైర్ స్టేషన్ వద్ద విధుల్లో ఉన్నారు.

అయ్యప్ప స్వాముల పాదయాత్ర



పి.గన్నవరం నుంచి అమలాపురానికి పాదయాత్ర చేస్తున్న అయ్యప్పస్వాములు

పి.గన్నవరం: పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని, రైసు మిల్లర్ల వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ నాయకుడు గణేశుల చిన కొండలరావు ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వాములు అమలాపురం వరకూ పాదయాత్ర నిర్వహించారు. పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్ నుంచి ముంగండ, మాచవరం, అంబాజీపేట, బండారులంక గ్రామాల మీదుగా అమలాపురంలో అయ్యప్ప స్వామి వారి ఆలయం వరకూ పాదయాత్ర జరిగింది. అయ్యప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం మండలంలోని అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం



విఘ్నేశ్వరుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆది, సోమవారాల్లో భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామిని మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామికి గరిక పూజ జరిపారు. ఏడుగురు చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాలు, నామకరణలు నిర్వహించారు. స్వామికి వివిధ పూజలు, అన్నదానాల ద్వారా రూ.2,66,384 లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.